






పోరు భీకరంగా, ఎడతెగకుండా కొనసాగుతోంది - ఇది ఇంద్రియలన్నీ నిర్ధారించిన విషయం. పోరాటపు సిసలైన రుచి గాల్లో వ్యాపించి వుంది. ఇప్పుడు అంతా సద్దు మణిగింది. ఇక మిగిలిందల్లా క్షతగాత్రులకు చికిత్స చెయ్యడమూ, మృతుల్ని పాతిపెట్టడమూనూ - శవాల్ని ఖననం చేసే బృందాల్లోని ఒక చమత్కారి మాటల్లో చెప్పుకోవాలంటే - 'ఓ మూలకు ఊడ్చి పడెయ్యడం'. ఈ ఊడ్చి పడేసే కార్యక్రమం పెద్ద ఎత్తున చెయ్యాల్సిన అవసరం ఏర్పడింది. అడవిలో కనుచూపు మేర అంతటా విరిగిన చెట్ల మధ్య ఛిన్నాభిన్నమైన మానవ దేహాలు, గుర్రాల కళేబరాలు చెల్లా చెదురుగా పడి వున్నాయి. స్ట్రెచ్చర్ వాహకులు శిధిలాల మధ్య కలయ తిరుగుతూ కొనవూపిరితో వున్న వాళ్లని స్ట్రెచ్చర్లమీదికి ఎత్తి మోసుకెళ్లిపోతున్నారు. గాయపడ్డ వాళ్ళలో చాలామంది చికిత్సకు నోచుకోలేక ప్రాణాలు వదిలారు. రణభూమిలోని సైనికులకు సంబంధించి - తమ అవసరాల్ని తీర్చుమని అడిగే హక్కు ఆ కాలంలో వివాదంలో వుంది. అప్పటి సైనిక నిబంధనల ప్రకారం క్షతగాత్రులు సహాయ కార్యక్రమాలు అందేవరకూ ఓపికగా ఎదురు చూస్తూ కూచోవాల్సిందే. శత్రువుపైని విజయమే తమకు న్యాయం చేకూర్చే ఉత్తమ విధానమని భావించారు. సహాయం కొరకు పడిగాపులు పడే మనిషికి గెలుపు నిజంగా ప్రయోజనకారి - సందేహం లేదు - కాని పెక్కుమంది ఆ ప్రయోజన ఫలాలు చేతికందేలోపున్నె పరలోకం చేరుకుంటారు.

పదులు, వందల సమూహాల్లో లభ్యమవుతున్న మృతదేహాల్ని ఒకదాని పక్కన మరొటిగా సోలుపుగా పండుకోబెట్టి, ఖనన బృందాల సిబ్బంది, వాటిక్కావాల్సిన పరిమాణంలో గోతులు తవ్వుతారు. ఈ సామూహిక సమాధుల్లోకి చేర్చలేనంత దూరంలో పడివున్న శవాల్ని అక్కడికక్కడే పాతేస్తారు. మృతుల్ని గుర్తించడానికి ప్రత్యేక

తతంగమేమీ ఉండదు. అయినా చాలా సందర్భాలలో సిబ్బంది తమకు అందిన సూచనలనుసరించి శవాల్ని వేరు వేరుగా ఉంచుతారు. లాంఛన ప్రాయంగా జరిగే పరిశీలనానంతరం 'వీరోచితంగా పోరాడి అమరులైన వీరజవానుల' జాబితా ఒకటి ఆదరాబాదరాగా తయారవుతుంది. శత్రుపక్షం వారి మృతదేహాల్ని మాత్రం ఒకటికి రెండుసార్లు లెక్కించి, దళకమాండరు, ఆ సంఖ్యను కొద్దిగా పెంచి అధికారి నివేదికలో పొందుపరుస్తాడు. ఈ సంఖ్య యుద్ధ ఫలితాల కన్నా, విజయం పట్ల తమకున్న నమ్మికను సూచించేది మాత్రమే అవుతుంది.

ఒకానొక ఖననబృందం పర్యవేక్షిస్తున్న పాతరకు కొంత దూరంలో, ఫెడరల్ ఆఫీసర్ యూనిఫారంలో ఉన్న వ్యక్తి ఒకడు తన వీపును చెట్టుకు ఆనించి నిలబడ్డాడు. ఆ పాద మస్తకం అతడి వాలకం అసహనాన్ని ప్రదర్శిస్తోంది. మాటమాటికీ తల అటూ ఇటూ తిప్పుతున్నాడు. అతడి అంతరంగంలో ఏదో అలజడి, అశాంతి చెలరేగుతున్నాయనేది సుస్పష్టం. బహుశా - ఏ దిశగా వెళ్లాలి అన్న సందిగ్ధంలో పడ్డట్టున్నాడు. ఎంతోసేపు అక్కడే వుండాలనుకోవడం లేదతను. అస్తమిస్తున్న సూర్యుని ఎర్రని కిరణాలు చెట్లమధ్య సందుల్లోంచి వాలుగా, వాడిగా పడుతూ వొంటిని చిర చిర లాడిస్తోన్నాయి. అలసి సొలసి సైనికులు ఆ రోజుకు పని చాలించే యోచనలో ఉన్నారు. తను ఒక్కడే ఒంటరిగా ఆ కళేబరాల నడుమ రాత్రంగా గడపాలనుకోవడం లేదు. యుద్ధానంతరం నువు కలుసుకునే ప్రతి పదిమందిలో తొమ్మండుగురు సేనా విభాగానికి చెందిన ఏదో అంశం గురించి అడుగుతారు - తెల్సుకుందామని. నిస్సందేహంగా ఈ ఆఫీసర్‌కి మనసు మనసులో లేదు. అతడు కాస్తాగాక, పని విరమించుకుని విశ్రాంతికై వెళుతున్న బృందాల్లో దేన్నో ఓ దాన్ని అనుసరించి పోతాడు.

ఎవరి దోవన వాళ్ళు పోయాక, అతడు తిన్నగా అడవిలోకి పడమర దిశగా నడిచాడు. పశ్చిమాద్రి నుండి ప్రసరిస్తున్న సంజె వెలుగులో అతడి ముఖమ్మీద రక్తం పులిమింది. అప్పటిదాకా అడుగుల్ని ముందుకు లాక్కొచ్చిన విశ్వాసం, తనిప్పుడు పరిచితమైన ప్రదేశంలో ఉన్నాడని తెలియ చెప్పడంతో అతడు తన్ను తాను స్వాధీనం లోకి తెచ్చుకున్నాడు. ఇరువైపుల ఉన్న కళేబరాల్ని ఏ మాత్రం పట్టించుకోకుండా మున్ముందుకే నడిచాడు. సహాయక బృందాల్ని చేరక, దాహమే తోడుగా, దుర్భరమైన రాత్రిని బహిరంగంగా ఆకాశంలోని నక్షత్రాల కింద గడపవల్సిన ఓ అభాగ్యుడి నన్నని మూల్గును సైతం విననట్టే నటించాడు. తను డాక్టరూ కాడూ, వెంట మంచినీళ్ళూ కొనితేలేదు - మరి అతడు నిజంగా చెయ్యగల్గిందేమున్నది?

లోతు తక్కువగా ఉన్న ఓ వాగు దగ్గర కొన్ని దేహాలు పడివున్నాయి. చటుక్కున ఆగి వాటివైపు వడివడిగా నడిచాడు. నడుస్తూనే ప్రతి ముఖాన్నీ నిశితంగా పరీక్షించాడు. ఇంకాస్త దూరంలో - తుప్పలు పొదలు పెరిగిన చదును నేలమీద ఉన్న దేహం వద్ద ఆగాడు. అత్యంత చేరువలోంచి పరిశీలించాడు దాన్ని - అది కొద్దిగా కదుల్తున్నట్టున్నది. ఇంకా ముందుకు వంగి దాని ముఖమ్మీద చెయ్యివేశాడు. కీచుగొంతుతో అరిచింది.

ఆ ఆఫీసర్ కెప్టెన్ డౌనింగ్ మాడ్వెల్, మాసాచుసెట్స్ పదాతి దళానికి చెందిన సైనికాధికారి, శూరుడుగా, కుశాగ్రబుద్ధిగా మన్ననలందుకున్నవాడు.

ఆ రెజిమెంటులో ఇద్దరు అన్నదమ్ములున్నారు. కాఫాల్ హాల్ క్రో, క్రీడ్ హాల్ క్రో వాళ్ళ పేర్లు. కెప్టెన్ మాడ్వెల్ పటాలంలో కాఫాల్ సార్జంటుగా వున్నాడు. సార్జంటూ, కెప్టెనూ ఇద్దరూ గాఢ స్నేహితులు. పదవుల్లో హెచ్చుతగ్గులున్నా, విధుల్లో తేడాలున్నా, మిలిటరీ క్రమశిక్షణ నియమాలు అనుమతించినంత మేరకు ఇద్దరు కలిసి మెలిసి తిరిగేవారు. నిజం చెప్పాలంటే వాళ్లిద్దరూ బాల్యంనుండీ కలిసి పెరిగారు. హృదయాల అనుబంధం సులభంగా వీడిపోదు. కాఫాల్‌కి మిలిటరీలో ఉద్యోగమంటే పెద్ద ఇష్టమేమీ లేదు. కాని నేస్తం నుండి ఎడబాటు అనే ఆలోచన భరించలేక పోయాడు. వెంటనే మాడ్వెల్ రెండవ లెఫ్టినెంట్‌గా పనిచేస్తున్న దళంలో తన పేరు నమోదు చేసుకున్నాడు. చెరి రెండు అంచెలు పైకి ఎదిగారు. కాని ఒకడు నాన్‌కమీషన్డ్ ఉన్నతోద్యోగి. మరొకడు దిగువస్థాయి కమీషన్డ్ అధికారి. మునుపటిలా కాక ఇద్దరి మధ్యా ఇప్పుడున్న సాంఘిక అగాధం లోతైనదీ, విశాలమైనదీనూ. ఇబ్బందికరంగా ఉంటున్నప్పటికీ పాత స్నేహ సంబంధాలు కొనసాగిస్తూనే వున్నారు.

కాఫాల్ అన్న - క్రీడ్ హాల్ క్రో. రెజిమెంటులో మేజరు. నిరాశావాద దృక్పథం వల్లనో, మంద ప్రకృతి మూలంగానో ఏమో - ఇతడికి కెప్టెన్ మాడ్వెల్ అంటే గిట్టదు. ఒకరి పొడ మరొకరికి పడనంత సహజ విరోధం - పెరిగి పెరిగి కాలక్రమేణా ప్రత్యర్థులయ్యారు. కాఫాల్‌తో ఇద్దరికీ ఉన్న పరస్పర సంబంధం, ఆ ప్రభావం మూలంగా అబ్బిన సంయమనమే లేకపోతే ఆ ఇరువురు దేశభక్తులు బద్ధ శత్రువుల్లా వ్యవహరించి మిలటరీ సేవల్లోంచి ఎవరో ఒకరు తప్పుకునే వారే.

ఆ రోజు ఉదయం పోరు మొదలయ్యేటప్పుడు ఈ రెజిమెంటు ప్రధాన బలగాలకు మైలు దూరంలో ఔటుపోస్టు విధి నిర్వహిస్తోంది. శత్రువుల దాడికి గురి అయ్యా, అడవిలో చిక్కుబడిపోయి కూడా నిబ్బరంగా పోరాడింది రెజిమెంటు. ఒక దశలో పోరు వెనకపట్టు పట్టినప్పుడు మేజర్ హాల్ క్రో కెప్టెన్ మాడ్వెల్ దగ్గరికి వచ్చాడు. ఒకరికొకరు లాంఛనంగా సెల్యూట్ చేసుకున్నాక, మేజర్ ఇలా అన్నాడు; "కెప్టెన్, మీరు మీ కంపెనీని ముందుకు తీసికెళ్లి, ఈ కాలువ ముఖం దగ్గరే - మళ్లీ వెనక్కి పిలిపించే వరకు

(Ambrose Bierce (1842-? 1914, American) రాసిన **'The Coupe de Grace'** కి తెలుగు అనువాదం)

ఉండాలని కర్నల్ ఉత్తరువు. ఈ కదలికలోని ప్రమాద స్వభావం గూర్చి నేను మీకు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదనుకుంటా. అయితే మీరు ఈ ఉత్తర్వుని మీ మొదటి లెఫ్టినెంట్ వేపు త్రోసి వేయవచ్చు. ఇలా ప్రత్యామ్నాయం సూచించే అధికారం నాకు లేదని తెల్సు. ఇది అనధికారంగా మీకు ఇస్తున్న సలహా మాత్రమె..."

తల కొట్టేసినట్టయిన ఈ అవమానానికి కెప్టెన్ మాడ్వెల్ గంభీరంగా ప్రత్యుత్తర మిచ్చాడు: "మహాశయా, ఈ కదలికలో మీరూ వెంట ఉండాలని ఆహ్వానిస్తున్నాను. ఆరోహుడైన ఆఫీసర్ ముందు నడిస్తే ప్రధాన ఆకర్షణగా వుంటుంది. నేనెన్నటి నుండో అభిప్రాయపడుతున్నాను - మీరు ఛస్తే బాగుండునని..."

ఇలా కుక్కకాటుకి చెప్పుదెబ్బలాగా సమాధానమివ్వడం మిలిటరీ శ్రేణుల్లో 1862 నుంచీ ఉంది.

అరగంట పోయాక, మాడ్వెల్ దళాలు మూడొంతులు సేనని నష్టపోయి, కాలువ ముఖం నుండి వెనక్కి తరమబడ్డాయి. నేల కొరిగిన సైనికుల్లో సార్జంటు హాల్ క్రో ఉన్నాడు. మరు వెంటనే రెజిమెంటు ప్రధాన మొహరింపు రేఖ వేపు గెంటివేయబడింది. పోరు ఆగే సమయానికి మైళ్ల దూరంలోకి పోయింది. కెప్టెన్ ఇప్పుడు నిలబడింది - తన క్రింది ఉద్యోగీ, ఆప్తమిత్రుడూ అయిన వ్యక్తి ప్రక్కన!

సార్జంటు హాల్ క్రో తీవ్రంగా గాయ పడ్డాడు. దుస్తులు చీలికలు పీలిక లయినాయి. వేగంగా దూసుకొచ్చిన వస్తువేదో బలంగా తాకినట్టుగా పొట్ట చీలింది. అంతర్భాగాలు బహిర్గతమైనాయి. తోలు పటకా ముక్క లైంది - పడుకున్నవాడి కింది నుండి లాగి వేసినట్టుగా పక్కకు జారింది. రక్తస్రావ మెక్కువ అయిన దాఖలాలేమీ కనబడటం లేదు. కనపడుతున్న గాయమొక్కటే - చీలిన పొట్టలో ఎర్రగా, పచ్చగా ఉన్న వెడల్పయిన ఛిద్రం. దాని ధూళీ, ఎండుటాకులూ అంటుకుపోయాయి. తెగిపోయిన చిన్నప్రేవు కొస బయటికి పొడుచుకు వచ్చి వేలాడు తున్నది. ఇన్నేళ్ళ అనుభవంలో కెప్టెన్ మాడ్వెల్ ఇలాంటి దారుణమైన గాయం ఇదివరకెన్నడూ చూడలేదు. అది దేని మూలంగా అయిందో ఊహకందకుండా ఉంది. ఎదుట ఉన్న పరిస్థితి అర్థం కావడం లేదు. అర్ధదిగ్ధంగా చిరిగి వంటినుండి వేరయిన దుస్తులు, వ్రయ్యలైన తోలు పటకా, నల్లగా కమిలిపోయిన తెల్లటి చర్మం, ముఖం మీద పెట్టి నిశితంగా పరికించాడు బాధితుడ్ని. అర నిమిషం తర్వాత లేచి నిలబడ్డాడు. చుట్టువక్కల ఎక్కడైనా శత్రువులు పొంచి వున్నారేమోనని నలువైపులా చూపులు తిప్పాడు. యాభై గజాల దూరంలో, పల్చగా గుల్మాలు పెరిగిన దిబ్బమీద, సంచరిస్తున్న నల్లటి ఆకారాలు కంటబడ్డాయి. అది తోడేళ్ళ మంద. పీక్కు తినేందుకు పీనుగుల మీద మూగు తున్నాయి. సాగదీసిన జబ్బలతో, మానవ కళేబరం మీద నిల్పిన ముంగాళ్ళతో ఒక తోడేలు అతనివైపు వీపుపెట్టి నిల్చున్నది. ఎదురుగా కుంకుమ వర్ణం పశ్చిమాకాశం నేపథ్యంలో దాని వెన్ను, శరీరపు టంచులు నల్లగా కనబడుతున్నాయి. కెప్టెన్ మాడ్వెల్ అట్నుంచి దృష్టి మరల్చి, కింద నేలమీద మూల్గుతున్న ఆకారం మీద నిలిపాడు.

అత్యంత భీకరంగా గాయపడ్డ ఆ వ్యక్తి సజీవంగా ఉన్నాడు. అప్పుడోసారి, అప్పుడో సారి అంగాలు కదిలిస్తున్నాడు. శ్వాస తీసినప్పుడల్లా మూలిగాడు. స్నేహితుడి ముఖంలోకి నిర్వేదంగా చూశాడు. స్పర్శించినప్పుడు మాత్రం తీవ్రమైన నొప్పితో ఘూర్ణిల్లాడు. దుర్భరమైన ఆ యాతన తట్టుకోలేక నేలమీద మట్టి అసంకల్పితంగా పెళ్లగించాడు. బిగించిన ఆ పిడికిళ్ళలో మన్ను ఆకులు, పుల్లలు. మాట్లాడ్డం అతనికిప్పుడు శక్తికి మించిన పని. నొప్పి మినహా, వేరేది గ్రహించ గలిగే స్థితిలో ఉన్నాడో లేడో చెప్పడం కష్టం. ముఖ కవళికల్లో ఒక అర్థింపు ఉంది. కళ్ళు ప్రార్థిస్తున్నాయి. దేనికోసం?

ఆ చూపుల్ని మరో విధంగా అర్థం చేసుకునే వీల్లేదు. ఆ భావాన్ని కెప్టెన్ గతంలో ఎన్నోమార్లు చదివివున్నాడు - పెదాల మీద మాట్లాడేశక్తి ఉన్నా, కళ్ళతోటే చెప్పే సందేశం, చావు కొరకు అభ్యర్థించే మనుషుల చూపుల్లోని భావం..... బాధతో ఉంగలు చుట్టుకు పోతున్న ఆ మూగజీవి అత్యంత దైన్యానికి ప్రతీక. ఆ అవస్థ మనిషి, మృగం కలిసి గీచిన భీతావహ దృశ్యం. ఓటమి పాలయ్యిన ఆ ప్రామిథియస్, తెలిసో, తెలీకో - తన కోసమంటూ దేన్నో కాకుండా - కేవలం విముక్తిని ప్రసాదించమని కోరు కుంటున్నాడు. భూవ్యోమాకాశాలకు, వృక్షాలకు, ఎదుట వున్న మనిషికి, తన కళ్ళకు - స్పృహకు అందుతున్న ప్రతిదానికీ, మూర్తీభవించిన వేదనకు ప్రతిరూపంగా ఉన్న ఆ మందభాగ్యుడు తన నిశ్శబ్ద మనవిని విన్నవించుకుంటున్నాడు.

వాస్తవానికి అతడు ఏమి కోరుకుంటు న్నాడు? - మానవుడు తన స్వంతజాతికి తప్ప - ఇతర జీవజాలానికి చెందిన ఏ ప్రాణినైనా అడిగిందే తడవుగా సునా యాసంగా ఇవ్వగలిగేది; అదే విమోచన... దయార్ద్ర హృదయం ప్రేరేపించే వివశత్వ

గుండెకు సంబంధించిన వ్యాధుల గురించి పాఠకులు అడిగే ప్రశ్నలకు ప్రముఖ కార్డియాలజిస్ట్ డా॥వై.వి.రావుగారు (విజయవాడ) సమాధానాలిస్తారు.పాఠకులు తమ ప్రశ్నల్ని ప్రతినెలా 15వ తారీఖు లోపు 'ఆహ్వానం' కార్యాలయానికి పంపవల్సిందిగా మనవి.

- ఎడిటర్

చేష్ట - ఆఖరివేటు.

కెప్టెన్ మాడ్వెల్ లాలనగా మిత్రుడిని పేరు పెట్టి పిలిచాడు. గొంతు డగ్గుత్తిక చెందేదాకా మరీ మరీ పిలిచాడు. ఫలితం శూన్యం. అతని చెంపల మీదుగా కన్నీళ్ళు కారి, దిగువనున్న పాలిపోయిన ముఖం మీద చిప్పిల్లాయి. మసకబారిన దృష్టికి ఆ కదులుతున్న ఆకారం తప్ప మరేదీ ఆనడం లేదు. దాని మూల్గులు మునుపటి కన్నా మరింత స్పష్టంగా వినవస్తూ, అప్పుడప్పుడు ఘూర్ణింపుల్లాగా ధ్వనిస్తున్నాయి. చప్పున తల తిప్పుకుని లేచి నిలబడ్డాడు కెప్టెన్. నొసలు అరచేత్తో రుద్దుకుంటూ నాలుగైదు అడుగులు దూరంగా నడిచాడు. సమీపంలోని తోడేలు ఒకటి వికృతంగా నోరు తెరచి ఎర్రని నాలిక, తెల్లటి కోరల్ని బహిర్గతం చేసింది. క్షణం తర్వాత ఎదురు వున్న మనిషిని చూసి, అనుమానపడి, ఒక్క అంగలో పొదలచాటుకు మాయమయింది. ఫిరంగి గుండు దెబ్బకు ముందు కాళ్ళు రెంటినీ విరగ్గొట్టుకున్న గుర్రమొకటి, నేలమీది నించి తలకాయను జానెడు పైకెత్తి దీనంగా సకిలించింది. మాడ్వెల్ ఒకడుగు ముందుకు నడిచి రివాల్వర్ తీశాడు. గుర్రం కనుబొమల మధ్య నుండి గుండు దూసుకు పోయేలా పేల్చాడు. దాని చావు పోరాటాన్ని అతి చేరువలోంచి పరికించిన అతడికి - ఆ సంఘర్షణ తనూహించిన దానికి భిన్నంగా - చాలా ఉగ్రంగా, సుదీర్ఘంగా ఉన్నట్టనిపించింది. చివరికి ఆ జంతువు అచేతనంగా ఉండి పోయింది. అప్పటిదాకా గిలగిలలాడినపుడు పళ్ళు కనిపించేలా విచ్చుకుపోయిన దాని పెదాలు మూసుకుపోయినై. పక్కకు వాల్చిన దాని పొడుగైన ముఖంలో ప్రసన్నత, ప్రశాంతత చోటు చేసుకున్నాయి

దూరాన, పశ్చిమదిశ వెంటసాగిన అర్ణ్యం కొప్పుమీద, అస్తమయాగ్ని తలుకులు ఆరిపోయినై. మునిమాపు చీకట్లు మానుల్ని పెనవేసుకుంటున్నాయి. నీడలు, చెట్ల కొన కొమ్మలమీద గండభేరుండ పక్షుల్లా గూళ్లు కట్టాయి. రాత్రి సమీపిస్తోంది - కెప్టెన్‌కూ, సైనిక స్థావరానికీ మధ్య మైళ్ళ కొలది విస్తీర్ణమున్న అడవి నిలిచి ఉంది. అతడు అక్కడే ఆ చచ్చిన జంతువు దగ్గర పరిసరాల్ని మరిచిపోయినవాడిలాగా నిలబడ్డాడు. అతడి కళ్ళు, కాళ్ళ దగ్గరి నేలను గుచ్చి గుచ్చి చూస్తున్నాయి. ఎడమ చెయ్యి ఉత్తగా వేలాడుతున్నా, కుడిచెయ్యి పిస్టల్‌ని వడసి పట్టుకుంది. చటుక్కున తలెత్తి, చావు బ్రతుకుల్తో కొట్టు మిట్టాడుతున్న తన మిత్రుని వైపు గబగబా అడుగులు వేశాడు. మోకాళ్ళమీద కూర్చుని పిస్టల్ మొన స్నేహితుడి నుదిట మీద ఆనించి, ట్రిగ్గర్ నొక్కుతూ, మొగం తిప్పుకున్నాడు. ప్రేలుడు రాలేదు. ఆఖరి తూటా గుర్రం కోసం వెచ్చించాడు. బాధితుడు మరో మారు మూలిగాడు. గిజగిజలాడుతూ. అతడి పెదాలు అపస్మారక స్థితిలో లాగా వంకర్లు పోయాయి. వాటిల్లోంచి కారిన నురగలో రక్తపుజీరలు అగుపడ్డాయి.

కెప్టెన్ మాడ్వెల్ లేచి నిలబడి, ఒరలోంచి ఖడ్గం తీశాడు. కత్తి అంచు వెంబడి - పిడి నుంచి మొనదాకా - ఎడమచేతి వేళ్ళతో రాశాడు. తన మనోనిబ్బరాన్ని పరీక్షించుకునేందుకు, దాన్ని నిటారుగా పట్టుకుని, తేరిపార చూశాడు. ఎలాంటి తొణుకు బెణుకూ లేదు; సాయం సంధ్య చిట్ట చివరి వెలుగు కిరణం అసిధార మీద నిశ్చలంగా ప్రతిఫలించింది. కిందికి వంగి, బాధితుడి చొక్కా చింపి, కత్తిమొన గుండె స్థానంలో గురిపెట్టి లేచాడు. ఈసారి అతడు చూపులు మరల్చలేదు. రెండు చేతుల్తో పిడిని వడిసి పట్టుకుని, కత్తిని పైకి లేపి, బలమంతా కూడదీసుకుని, బరువుగా కిందికి దింపాడు. కత్తివాదర, కింద ఉన్న మనిషి గుండెలో దిగబడింది - గుండెలోంచి దిగి నేలకు గుచ్చుకుంది; కెప్టెన్ మాడ్వెల్ ఆ ఊపుకు ముందుకు తూలాడు. మరణశయ్యమీద వ్యక్తి మోకాళ్ళు విసురుగా పైకి లేపాడు. అదే సమయంలో కుడిచేతిని ఛాతీ మీదికి పోనిచ్చి కత్తిని బిగించి పట్టుకున్నాడు. ఎంత గట్టిగా పట్టుకున్నాడంటే వేలి కణుపులు తెల్లగా పాలిపోయినై. కత్తిని లాగి వేయాలన్న ఆ ఉగ్రమైన, వృథా ప్రయత్నంతో, గాయం మరింత వెడల్పయింది. సన్నని రక్తధార చిమ్మి, అస్తవ్యస్తమైన బట్టల్ని తడుపుతూ కిందికి జారింది. అప్పుడే - వాళ్ళ రాకని మరుగు పరుస్తున్న పచ్చటి, గుబురుచెట్లను దాటుకుంటూ ముగ్గురు మనుషులు చడీ చప్పుడూ లేకుండా ముందుకు వచ్చారు. వాళ్ళలో ఇద్దరు - స్ట్రెచ్చర్ మోస్తూ వచ్చిన ఆస్పత్రి సిబ్బంది.

మూడోవాడు మేజర్ క్రీడ్ హాల్ క్రో.

●

